రాజ్యాంగ నిర్మాతకు నివాళి

కరీంనగర్, కొత్తపల్లి మండలాల్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దేశానికి దశ, దిశ చూపిన ఆయనను సమాజం మరువవదని మేయర్ సునీల్‌రావు అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయం, విద్యుత్ భవన్, ఎస్సెస్సీ స్పాట్ వాల్యుయేషన్ కేంద్రం సెయింట్ జాన్ పాఠశాలలో, అల్ఫోర్స్ కేంద్ర కార్యాలయం, సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్, కరీంనగర్ బస్టాండ్‌లలో, బీజేపీ, సీపీఐ, సీపీఎం, వైఎస్సార్‌టీపీ, పీఆర్‌టీయూ, టీఆర్‌టీఎఫ్‌ల ఆధ్వర్యంలో నాయకులు అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. కొత్తపల్లి మండలంలోని బావుపేట, పట్టణంలోని ఆయన విగ్రహాలకు పూలమాలలు వేశారు. దేశానికి అంబేడ్కర్ చేసిన సేవలు మరువలేనివన్నారు. - సాక్షి నెట్‌వర్క్




అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మేయర్ సునీల్‌రావు, కమిషనర్, కార్పొరేటర్లు, అధికారులు, అదనపు కలెక్టర్ జీవీ.శ్యాంప్రసాద్‌లాల్, విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు


కృషి బిల్డింగ్ పేయింటింగ్ కార్మికుల సంఘం నాయకులు


కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రాజు...


డీఈవో జనార్దన్‌రావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు


ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లు, ఆర్‌ఎం ఖుస్రో షా ఖాన్, అధికారులు


అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు


జిల్లా ఆసుపత్రిలో కేక్ కట్ చేస్తున్న సూపరింటెండెంట్ రత్నమాల


సీపీఐ నాయకులు, కార్యకర్తలు..



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎలక్ట్రికల్ వైండింగ్ వర్కర్స్

క్లుప్తంగా

నేడు గాంధీ విగ్రహావిష్కరణ, ఐలాండ్ ప్రారంభం


మహాత్మాగాంధీ విగ్రహం

కరీంనగర్‌సిటీ: నగరంలో మహాత్మాగాంధీ ధ్యానముద్రలో ఉన్న భారీ విగ్రహాన్ని శనివారం సాయంత్రం 6 గంటలకు ఆవిష్కరించి, ఐలాండ్‌ను ప్రారంభించనున్నట్లు మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ల చేతుల మీదుగా ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. నగరంలోని కార్ఖాన గడ్డ ప్రాంతంలో కిసాన్‌నగర్ చౌరస్తా వద్ద నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రూ.50 లక్షలతో గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి, ఐలాండ్‌ను సుందరీకరించామని తెలిపారు. నగర ప్రజలు అధిక సంఖ్యలో హాజరై, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

హైదరాబాద్ తరలివెళ్లిన దళితబంధు లబ్ధిదారులు


బస్సుకు జెండా ఊపుతున్న ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి

కరీంనగర్‌రూరల్: హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి కరీంనగర్ మండలంలోని దళితబంధు లబ్ధిదారులతోపాటు దళిత సంఘాల ప్రతినిధులు తరలివెళ్లారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆర్టీసీ బస్సుకు ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి జెండా ఊపి, ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కన్నం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఖల్సా ఆవిర్భావ దినోత్సవం


కీర్తనలు ఆలపిస్తున్న సిక్కు సంఘం సభ్యులు

కరీంనగర్ కల్చరల్: సిక్కు సంఘం సభ్యులు 324వ ఖల్సా ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ప్రత్యేక కీర్తనలు ఆలపించారు. సాయంత్రం గురుద్వార సాహెబ్ మార్కెట్ రోడ్ సాగర్ జనరల్ స్టోర్స్, పోస్టాఫీసు, రూరల్ పోలీస్ స్టేషన్, బోయవాడ కమాన్ నుంచి తిరిగి గురుద్వారకు చేరుకున్నారు. కార్యక్రమంలో సాహెబ్ గురుద్వార ప్రబంధక్ కమిటీ అధ్యక్షుడు సర్దుల్ సింగ్, కార్యదర్శి బిషన్ సింగ్, తేజ్‌పాల్ సింగ్, రణబీర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ రూట్ మార్చ్



కరీంనగర్‌టౌన్: అంబేడ్కర్ జయంతి సందర్భంగా శుక్రవారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో సమరసత సంచలన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయం సేవకులు సంఘ యూనిఫాం ధరించి, పట్టణంలోని పలు ప్రాంతాల మీదుగా పథ సంచలన్ (రూట్ మార్చ్) చేపట్టారు. ఆర్ఎస్ఎస్ ప్రాంత వ్యవస్థా ప్రముఖ్ గంటా తిరుమల్ ముఖ్య వక్తగా హాజరై, మాట్లాడారు. దేశ అత్యంత గొప్ప నాయకుల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఒకరిని, అత్యంత పేదరికాన్ని అనుభవిస్తూ విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించారని పేర్కొన్నారు. ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని, ఎప్పుడూ ఆర్ఎస్ఎస్‌తో సత్సంబంధాలు కలిగి ఉండేవారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కన్నం దుర్గేశ్, మాననీయ విభాగ్ సంఘ చాలక్ మల్లోజుల కిషన్‌రావు, మాననీయ జిల్లా సంఘ చాలక్ చక్రవర్తుల రమణాచారి, జిల్లా సహ సంఘ చాలక్ ఎలగందుల సత్యనారాయణ, పాక సత్యనారాయణ, ప్రాంత గ్రామ వికాస్ ప్రముఖ్ జిన్నా సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులతో స్నేహభావం పెంపు

- నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

విద్యానగర్: ఇఫ్తార్ విందులతో స్నేహభావం పెంపొందుతుందని నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. రంజాన్ సందర్భంగా శుక్రవారం ఎంఐఎం పార్టీ కరీంనగర్ నగర శాఖ ఆధ్వర్యంలో స్థానిక అశోక్‌నగర్‌లోని ఎస్ఎస్ గార్డెన్స్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసం మతసామరస్యానికి ప్రతీకగా, హిందూ–ముస్లింల ఐక్యతకు మారుపేరుగా నిలుస్తుందన్నారు. ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, పార్టీ నగర ప్రధాన కార్యదర్శి సయ్యద్ బర్కత్ అలీ, జాయింట్ సెక్రటరీలు సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రీ, ఖమరుద్దీన్, కోశాధికారి ఇబ్రహీం బియబాని, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అఖిల్ ఫిరోజ్, కార్పొరేటర్ షర్ఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


విందులో ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, అహ్మద్ హుస్సేన్, నాయకులు

అంబేడ్కర్ సిద్ధాంతాన్ని అనుకరించాలి

- ట్రైనీ కలెక్టర్ నవీన్ నికోలస్

కరీంనగర్: రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బోధించు.. సమీకరించు.. పోరాడు అనే సిద్ధాంతాన్ని మనమందరం అనుకరించాలని ట్రైనీ కలెక్టర్ నవీన్ నికోలస్ అన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని కరీంనగర్ కోర్టు చౌరస్తా వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. బహుజనులందరూ కలిసి ఉండాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల కోసం రాష్ట్ర ప్రభుత్వం వెయ్యికి పైగా రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రారంభించిందని అన్నారు. విదేశీ విద్యనభ్యసించడానికి రూ.20 లక్షల ఆర్థికసాయం అందిస్తున్నట్లు చెప్పారు. అంతకుముందు కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్, చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మేయర్ వై.సునీల్‌రావు, అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, జీవీ శ్యాంప్రసాద్‌లాల్, ట్రైనీ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి, మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు.


కేక్ కట్ చేస్తున్న ట్రైనీ కలెక్టర్ నవీన్ నికోలస్

నీరు విడుదల చేయాలని రైతుల రాస్తారోకో



చొప్పదండి: ఎస్సారెస్పీ ద్వారా డీ87 ఉపకాలువకు వెంటనే నీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చొప్పదండి పట్టణంలోని కరీంనగర్ రోడ్డులో ఉన్న ఉపకాలువ వద్ద ప్రధాన రోడ్డుపై రైతులు శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. చొప్పదండితో పాటు కొలిమికుంట, చాకుంట, వెదురుగట్ట శివారులో ఉన్న వరిపంట చివరిదశలో ఉన్నందున మరోమారు ఎస్సారెస్పీ నీరు విడుదల చేసి పంటలను, రైతులను ఆదుకోవాలని రైతులు కోరారు. సీఐ రవీందర్ ఆందోళన స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. ఎస్సారెస్పీ ఏఈతో మాట్లాడించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో రాజన్నల తిరుపతి, నూనె శేఖర్, గుర్రం రాజశేఖర్ రెడ్డి, గుర్రం వెంకట్ రెడ్డి, కచ్చు శ్రీనివాస్, వీరేశం, శ్రీనివాస్, వేణు, వెంకటయ్య, శ్రీకాంత్, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

మైదానాలను అద్దెకు ఇవ్వొద్దు


కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియం


అథ్లెటిక్ ట్రాక్‌పై కంకర


స్టేడియంలో చిన్నారుల సందడి

- సెలవు రోజుల్లో ఆడుకునేందుకు పిల్లల ఇబ్బందులు
- ఆటలకే పరిమితం చేయాలంటున్న నగరవాసులు

కరీంనగర్ స్పోర్ట్స్: స్మార్ట్‌సిటీలో భాగంగా కరీంనగర్ నగరాన్ని అందంగా తీర్చిదిద్దుతున్నారు. ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడ ఏదో ఒకటి అమర్చుతున్నారు. నగరం నడిబొడ్డున ఉన్న జ్యోతిబా పూలే, పురాతన పాఠశాల మైదానాల్లో పార్కులు ఏర్పాటు చేయడంతో పిల్లలకు ఆటస్థలం కరువైంది. ఏటా 45 రోజులపాటు వేసవి సెలవులు వస్తాయి. ఆయా రోజుల్లో విద్యార్థులు పుస్తకాలను పక్కనపెట్టి, రోజంతా ఆటలు ఆడుతుంటారు. అంబేడ్కర్ స్టేడియం, ఎస్సారార్ కళాశాల మైదానాలను ఇటీవలి కాలంలో ఏదో ఒక కార్యక్రమానికి అద్దెకిస్తూ చిన్నారుల ఆటలకు ఆటంకం కలిగిస్తున్నారు. రోజుల తరబడి ఇలా చేస్తుండటంతో సెలవుల్లో పిల్లలు ఆడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఉన్న రెండు మైదానాలను సెలవు దినాల్లో ఎలాంటి కార్యక్రమాలకు అద్దెకు ఇవ్వొద్దని నగరవాసులు కోరుతున్నారు.

అందరి దృష్టి స్టేడియం పైనే..

కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియాన్ని ఇటీవల ఇతర కార్యక్రమాలకే వినియోగిస్తున్నారు. ఇలా అయితే పిల్లలు ఆటలు ఆడుకోవడమెలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలో అధికారులకు సైతం వినతిపత్రాలు అందించారు. నగరంలో ఎక్కడా ఖాళీ స్థలం లేకపోవడంతో అందరి దృష్టి స్టేడియం పైనే ఉంది. ప్రభుత్వ, ప్రైవేటు కార్యక్రమాలకు నిర్వాహకులు చలో స్టేడియం అంటున్నారు. రాజకీయ పార్టీల బహిరంగ సభలు, ప్రైవేటు విద్యాసంస్థల వార్షికోత్సవాలు, క్రాఫ్ట్ బజార్‌లు, క్రాకర్స్ అమ్మకాలు, షోలు ఇలా అన్నింటికీ అద్దెకిస్తున్నారు. ఆటస్థలాలు ఆటలకే పరిమితం చేయాలని, ఇతర కార్యక్రమాలకు ఇవ్వొద్దని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

ఇష్టారాజ్యంగా తవ్వకాలు..

ఇతర కార్యక్రమాలకు మైదానాలను అద్దెకివ్వడంతో సంబంధిత ఏర్పాట్లలో భాగంగా నిర్వాహకులు ఎక్కడ పడితే అక్కడ తవ్వేస్తూ కంకరణ పోయిస్తున్నారు. కార్యక్రమం అనంతరం కంకరను అలాగే వదిలేస్తున్నారు. ఈ విషయంలో జిల్లా క్రీడాశాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. రన్నింగ్ ట్రాక్‌లో కంకర ఉంటే పరిగెత్తడం ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఇతర కార్యక్రమాలకు వద్దు



కరీంనగర్‌లో ప్రస్తుతం ఉన్నవి అంబేడ్కర్ స్టేడియం, ఎస్సారార్ కళాశాల మైదానం మాత్రమే. వేసవి సెలవుల్లో చిన్నారులు ఆడుకునేందుకు వీలుగా వీటిని తీర్చిదిద్దాలి. అలాగే సెలవుల్లో ఇతర కార్యక్రమాలకు అద్దెకు ఇవ్వొద్దు.
– చాద రవీందర్ రెడ్డి

ఆటలకే కేటాయించాలి



మైదానాలను ఆటలకే కేటాయించాలి. స్టేడియంలో ఆడుకునేందుకు ప్రతీరోజు ఉదయం, సాయంత్రం అధిక సంఖ్యలో పిల్లలు వస్తుంటారు. ఇతర కార్యక్రమాలకు అద్దెకు ఇస్తే నిర్వాహకులు ఇతరులను అడుగుపెట్టనివ్వరు.
– వేల్పుల వెంకటేశ్

పార్లమెంటు భవనానికి అంబేడ్కర్ పేరు పెట్టాలి

కరీంనగర్: ఢిల్లీలో నిర్మిస్తున్న నూతన పార్లమెంట్ భవనానికి బాబాసాహెబ్ అంబేడ్కర్ పేరు పెట్టాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీమా సాహెబ్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ గిరిజన సంఘం, డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని కోర్టు చౌరస్తాలో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేష్, కార్యదర్శి తిరుపతి, నాయకులు రఘు, రమేశ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..

ఎస్ఎఫ్ఐ శాతవాహన యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో వర్సిటీ ఆవరణలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. జిల్లా అధ్యక్షుడు గజ్జల శ్రీకాంత్, యూనివర్సిటీ నాయకులు కోటేశ్, నాగేంద్రబాబులు మాట్లాడుతూ.. అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తామని అన్నారు. కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ నాయకులు శశి, రాకేశ్, లెనిన్, రవితేజ, నందు, వంశీ తదితరులు పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న గిరిజన నాయకులు

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కొత్తపల్లి: కరీంనగర్‌లోని రాంనగర్‌కు చెందిన ఉప్పరపల్లి శ్రీనివాస్(32) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కొత్తపల్లి ఎస్సై బి.ఎల్లయ్యగౌడ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ ఓ గ్యాస్ కంపెనీలో డెలివరీ బాయ్‌గా పనిచేసేవాడు. మద్యం, జూదానికి అలవాటు పడి, అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం లేక తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో ఈ నెల 11న చింతకుంట శివారులోని మానేరు నది దగ్గర క్రిమిసంహారక మందు తాగుతూ ఫొటో తీసుకున్నాడు. దాన్ని తన వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకున్నాడు. అది చూసిన కుటుంబసభ్యులు వెంటనే అక్కడికి వెళ్లి, అతన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 13న చనిపోయాడు. మృతుడి భార్య రాణి శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.